



నమస్తే తెలంగాణ
# సిద్దిపేట
I హైదరాబాద్, శనివారం 29 జూన్ 2024 SIDDIPET


# పీవీ సేవలు చిరస్మరణీయం



హుస్నాబాద్‌లో పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జూన్ 28: భారత ప్రధానమంత్రిగా పీవీ నర్సింహారావు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తితో నేటి రాజకీయ నాయకులు ముందుకు పోతే దేశం ఎంతో బాగుపడుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో స్వర్గీయ పీవీ నర్సింహారావు జయంతిని కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించగా వీవీ చిత్రపటం వద్ద ఆయన నివాళులర్పించారు. తెలంగాణ ముద్దుబిడ్డ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని వంగర గ్రామానికి చెందిన పీవీ అంచెలంచెలుగా ఎదిగి దేశ ప్రధాని అయ్యాడంటే ఆయన కృషి, పట్టుదల ఎంత ఉందో అర్థమవుతుందన్నారు. దేశంలో ఆర్థిక, భూసంస్కరణలు ప్రవేశ పెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. ఆయన చూపిన దారిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు కేడం లింగమూర్తి, ఎండీ హసన్, బస్వారాజు శంకర్, చిత్తారి పద్మ, వల్లపు రాజు, పున్న సది, కిష్టస్వామి, వీరన్ననాయక్ పాల్గొన్నారు.

# రెగ్యులర్ ఈవో లేక ఇక్కట్లు

- కొమురవెల్లి ఆలయానికి మూడేండ్లుగా ఇన్‌చార్జి ఈవోనే దిక్కు
- సమీపిస్తున్న బ్రహ్మోత్సవాలు
- పెండింగ్‌లో 50 కాటేజీలు, క్యూలైన్ నిర్మాణం
- ఇటీవల వివాదాస్పదంగా మారిన పలు ఘటనలు
- అటకెక్కిన దేవాదాయశాఖ మంత్రి హామీ
- మొదలుకాని అమ్మవార్ల బంగారు కిరీటం తయారీ పనులు

చేర్యాల, జూన్ 28 : రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ఒకటైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రానికి రెగ్యులర్ ఈవో లేకపోవడంతో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతుండడంతో పాటు ఆలయ అభివృద్ధికి అడ్డంకిగా మారింది. ఈ ఆలయంలో మూడేండ్లుగా ఇన్‌చార్జి ఈవో పాలన కొనసాగుతున్నది. రానున్న డిసెంబర్‌లో మల్లన్న కల్యాణోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా ప్రారంభించాల్సిన పనులకు అతీగతి లేకుండా పోయిందని స్థానికులు మండిపడుతున్నారు. ఎక్కడా లేనివిధంగా కొమురవెల్లి క్షేత్రంలో మూడు నెలల పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల సమయంలో ప్రతి ఆదివారం సుమారు 50 నుంచి 60 వేల మంది భక్తులు, ప్రతి బుధవారం 25 నుంచి 40వేల మంది భక్తులు దర్శించుకుంటారు. రెగ్యులర్ ఈవోను నియమించక పోవడంతో ఆలయ అభివృద్ధి పనులే కాకుండా భక్తులకు సేవలు సరిగ్గా అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుత ఇన్‌చార్జి ఈవో బాలాజీ మూడేండ్లుగా సమర్థవంతంగానే విధులు నిర్వహిస్తున్నారు. ఆయన త్వరలోనే ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో ఆయన హైదరాబాద్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించేందుకు మొగ్గు చూపుతున్నారు.

**అటకెక్కిన దేవాదాయశాఖ మంత్రి హామీ..**

కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన 10 రోజుల్లోనే కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం రావడంతో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఉత్సవానికి హాజరయ్యారు. వచ్చే బ్రహ్మోత్సవాలకు అమ్మవార్లు(బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మ)లకు బంగారు కిరీటాలు తయారు చేయించి సమర్పిస్తామని హామీ ఇచ్చారు. దేవాదాయశాఖ మంత్రి హామీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో కిరీటాలు తయారు చేసేందుకు కావాల్సిన బంగారం లాకర్లలో మగ్గుతున్నది. బీఆర్ఎస్ హయాంలో ఆనాడు మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీ మేరకు మల్లన్న స్వామికి వెండి సింహాసనం, బంగారు కిరీటం చేయించి కల్యాణోత్సవం రోజున అందించి హామీ నెరవేర్చి భక్తుల మన్ననలు పొందారు. కాంగ్రెస్ పాలనలో అమ్మవార్లకు ఇచ్చిన బంగారు కిరీటం హామీ నెరవేరుతుందో లేదో వేచిచూడాల్సి సమయం ఆసన్నమైంది.రెగ్యులర్ ఈవో స్థానికంగా ఉండి పనులు ప్రారంభిస్తే డిసెంబర్ మూడో వారంలో ప్రారంభమయ్యే కల్యాణోత్సవానికి బంగారు కిరీటం రెడీ అయ్యే అవకాశం ఉంటుంది.

**పెండింగ్‌లో అభివృద్ధి పనులు..**

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రూ.12 కోట్లతో అత్యాధునిక క్యూలైన్ నిర్మాణ పనులు, రూ.10 కోట్లతో 50 కాటేజీల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. భక్తులకు ఉపయోగపడే ఈ రెండు పనులు బ్రహ్మోత్సవాల నాటికి అందుబాటులోకి తెస్తే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.కానీ, ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ఆలయ ఉద్యోగుల మధ్య గొడవలు, పోలీస్‌స్టేషన్లలో కేసులు, పెండింగ్‌లో అభివృద్ధి పనులు, స్వామివారి కల్యాణోత్సవం సమీపిస్తుండడంతో రెగ్యులర్ ఈవో అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. ఉద్యోగుల మధ్య సమన్వయం, అభివృద్ధి పనులు పూర్తి చేయడం, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, భక్తులకు వసతులు కల్పించేందుకు రెగ్యులర్ ఈవో ఉంటే బాగుంటుందని అందరూ కోరుతున్నారు. రెగ్యులర్ ఈవోను నియమిస్తేనే మల్లన్న క్షేత్రంలో పరిపాలన గాడిన పడడంతో పాటు అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయని భక్తులు అభిప్రాయ పడుతున్నారు.



కొమురవెల్లిలో నత్తనడకన కొనసాగుతున్న క్యూలైన్ భవన నిర్మాణ పనులు

# చిన్నారిని పొట్టన పెట్టుకున్న వీధికుక్కలు

- ఇస్నాపూర్‌లో బీహార్ చిన్నారి మృతి
- కర్ధనూర్, ముత్తంగిలో మరో ఇద్దరు చిన్నారులకు గాయాలు

పటాన్‌చెరు, జూన్ 28 : సంగారెడ్డి జిల్లాలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. శుక్రవారం ఇస్నాపూర్ పంచాయతీ పరిధిలో ఏకంగా ఆరేండ్ల చిన్నారిపై కుక్కలు దాడిచేసి చంపేశాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో బీహార్‌కు చెందిన బుల్బుమ్, ప్రమీల దంపతులు మహీధర వెంచర్‌లో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. వెంచర్ వద్ద గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. శుక్రవారం ఉదయం వీరి కుమారుడు విశాల్ (6) బహిర్భూమికి గుడిసె సమీపంలో వెళ్లాడు. అక్కడు వీధికుక్కలు విశాల్‌పై దాడి చేసి తలకొరికి చంపేశాయి. కుక్కలు విశాల్‌ను తినే ప్రయత్నం చేయడం గమనించిన కూలీలు, స్థానికులు కుక్కలను తరిమి విశాల్ మృతదేహాన్ని కాపాడుకున్నారు. భార్యాభర్తలు కుమారుడి మృతదేహాన్ని చూసి విలపించారు. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఏరియా దవాఖానకు తరలించారు.

**ముత్తంగిలో...**

పటాన్‌చెరు మండలం ముత్తంగిలో శుక్రవారం వీధికుక్క దాడిలో స్వాతి (7) అనే బాలిక తీవ్రంగా గాయపడింది. బాలికను స్థానికులు కుక్క దాడి నుంచి కాపాడి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానకు తరలించారు.

**కర్ధనూర్‌లో ఆలస్యంగా వెలుగులోకి...**

పటాన్‌చెరు మండలం కర్ధనూర్‌లో బుధవారం రోజు వీధి కుక్కలు భాను(13) అనే బాలుడిపై దాడి చేసి గాయపరిచాయి. కుటుంబసభ్యులు అతడిని ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

**చెలరేగిపోతున్న వీధి కుక్కలు**

ఇస్నాపూర్, ముత్తంగి, కర్ధనూర్, లక్డారం, చిట్కుల్, పటాన్‌చెరు, అమీన్‌పూర్, తెల్లాపూర్‌లో వీధి కుక్కలు చెలరేగిపోతున్నాయి. కుక్కల దాడిలో నిత్యం అనేక మంది గాయపడుతున్నారు. లక్డారం గ్రామంలో ఇటీవల 10మందిని ఒక కుక్క కరిచింది. పిచ్చికుక్కలు, వీధి కుక్కలు ద్విచక్రవాహనాలను వెంబడించి ప్రజలను కరుస్తున్నాయి. అకస్మాత్తుగా వెంట పడుతుండడంతో వాహనదారులు వాటి బారినుంచి తప్పించుకునేందుకు వేగంగా ముందుకు వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు, వ్యాక్సిన్ వేసేందుకు గతేడాది కలెక్టర్ ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో వీధికుక్కలను పట్టుకుని కందిలోని వెటర్నరీ ఆపరేషన్ థియేటర్‌కు పంపించాలని ఆదేశించారు. అప్పుడు తూతూమంత్రంగా కుక్కలను పట్టుకుని ఆపరేషన్లు చేశారు. అధికశాతం కుక్కలను పట్టకపోవడం ఇప్పుడు ప్రజల ప్రాణాల మీదికి వస్తున్నది. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ వెళ్తున్న వారిపై దాడి చేస్తున్నాయి. గ్రామాల్లో ఓవర్‌హెడ్ నీటి ట్యాంకులు, ఇండ్ల డాబాలపై రాత్రి వేళల్లో నిద్రిస్తున్నాయి. కుక్కల భీకర అరుపులతో ప్రజలకు రాత్రివేళ నిద్ర కరువవుతున్నది.



వీధి కుక్కల దాడిలో మృతి చెందిన విశాల్



చేగుంట మండలం వడియారం బైపాస్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన లారీ

# రక్తం చిందిన రహదారి

- చేగుంట బైపాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టిన మేకల లారీ
- ఐదుగురు అక్కడికక్కడే మృతి
- మృతులు మధ్యప్రదేశ్ వాసులు
- వందకు పైగా మేకలు మృతి

చేగుంట, జూన్ 28: మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం బైపాస్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఐదుగురు ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. వందకు పైగా మేకలు మృతిచెందాయి. చేగుంట పోలీసుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన ఎండీ ఇబ్రహీం(21), చిక్వ రాజు(57), చిక్వ మనీశ్ (30), ఎండీ షబ్బీర్‌ఖాన్(48), ఎండీ జిసన్(21), రమేశ్, మహేశ్, శుక్లాల్,లాల్‌మని మేకల వ్యాపారి, మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన లారీ డ్రైవర్ బుట్టాసింగ్ కలిసి నాగ్‌పూర్ నుంచి 450 మేకలను గురువారం లారీలో నింపుకొని హైదరాబాద్ మేకల మండీకి బయలుదేరారు. శుక్రవారం తెల్లవారు జామున 5గంటల ప్రాంతంలో మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం బైపాస్ రోడ్డులో ముందుగా వెళ్తున్న లారీని వీరి లారీ వేగంగా ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. రమేశ్, మహేశ్, శుక్లాల్, లాల్‌మని, బుట్టాసింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు.ఐదుగురితో పాటు వందకు పైగా మేకలు మృతి చెందాయి. ఘటనా స్థలానికి తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, చేగుంట ఎస్సై బాల్‌రాజు సిబ్బందితో చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు లారీలను రోడ్డుపై నుంచి తొలిగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్సై బాల్‌రాజు తెలిపారు.



చేగుంట మండలం వడియారం బైపాస్‌లో రోడ్డు ప్రమాదానికి గురైన క్షతగాత్రులను 108లో తరలించేందుకు తీసుకెళ్తున్న సిబ్బంది

# ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

- కనుమరుగవుతున్న కొండలు, గుట్టలు
- చోద్యం చూస్తున్న అధికారులు



గ్రామ శివారులో నిల్వ చేసిన మట్టి కుప్పలు



ట్రాక్టర్‌లో మట్టిని నింపుతున్న జేసీబీ


చౌటకూర్, జూన్ 28: సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం శివంపేటలో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేస్తుండడంతో గ్రామంలో సహజ సిద్ధంగా వెలిసిన కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. సంగారెడ్డి-నాందేడ్-అకోలా 161 జాతీయ రహదారికి అనుకుని శివంపేట గ్రామం నుంచి మండల కేంద్రం చౌటకూర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన వెంచర్లలోని అంతర్గత రహదారుల కావాల్సిన ఎర్ర మట్టిని రాత్రీపగలు అనే తేడా లేకుం డా అక్రమంగా తరలిస్తున్నారు. స్థానికులు అడ్డుకున్నా అక్రమార్కులు ఆగడం లేదు. రెవెన్యూ, పోలీసు అధికారులకు నెలనెలా మామూళ్లు ఇచ్చి దందా నడిపిస్తున్నామని చెబుతున్నారు. జేసీబీల సహాయంతో భారీ టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టిని ఒకచోట డంప్ చేస్తున్నారు. డంప్ చేసిన అనంతరం అక్కడి నుంచి వెంచర్ల నిర్వాహకులతో బేరం కుదుర్చుకుని మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ. 5వేల నుంచి రూ.7 వేల వరకు, ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 3వేల నుంచి రూ.4వేల వరకు మట్టిని విక్రయిస్తున్నారు. శివంపేట గ్రామ శివారులో గల కంకర మిషన్ ప్రాంతంతో పాటుగా వీర హనుమాన్ ఆలయ ప్రాంతం లో ఉన్న కొండలు, గుట్టలను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. స్థానికులు అడ్డుకుంటే వారితో దురుసుగా ప్రవర్తిస్తూ దాడులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నా యి. కొండలు, గుట్టల నుంచి తవ్విని మట్టిన తమకు అనువైన ప్రదేశంతో పాటుగా గ్రామ శివారులో ఈజీఎస్ నిధులతో నిర్మించిన క్రీడా ప్రాంగణంలో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి వెంచర్లకు, సంగారెడ్డి, జోగిపేట తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మట్టి దందాపై సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**కఠిన చర్యలు తీసుకుంటాం..**

అక్రమంగా మట్టిని తరలించినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో అనుమతులు లేకుండా కొండలు, గుట్టల ను తవ్వితే క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. మండలంలో ఎక్కడైనా అక్రమంగా మట్టిని తరలిస్తే ఫిర్యాదు చేయాలి. అనుమతులు లేకుండా వెంచర్లకు మట్టిని తరలిస్తూ పట్టుబడితే ఆ వాహనాలను సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తాం.

**- యాదగిరి, చౌటకూర్ ఆర్ఐ**

**దందాను అడ్డుకోవాలి..**



శివంపేట గ్రామ శివారులో మట్టి తరలింపును అడ్డుకోవాలి. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అదే పనిగా మట్టి దందా చేస్తూ బాగా సంపాదిస్తున్నారు. ఈ విషయమై పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫి ర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. గ్రామ శివారులో ఎక్క డ చూసినా మట్టికుప్పల నిల్వలే కనిపిస్తున్నా యి. అధికారులు స్పందించి మట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి.

**- ఎండీ అలీం, శివంపేట గ్రామస్తుడు**

# త్వరలోనే ధరణి దరఖాస్తుల పరిష్కారం

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



వెల్దుర్తి తహసీల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

వెల్దుర్తి,జూన్ 28 : భూసమస్యల పరిష్కారానికి రైతులు పెట్టుకున్న ధరణి దరఖాస్తులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శుక్రవారం వెల్దుర్తి తహసీల్ కార్యాలయం, ప్రభుత్వ దవాఖాన, ప్రభుత్వ పశు వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తహసీల్ కార్యాలయంలో ధరణి దరఖాస్తుల వివరాలు తెలుసుకున్న కలెక్టర్, పరిష్కారం చేస్తున్న తీరును తహసీల్దార్ తులసీరామ్‌ను అడిగి తెలుసుకున్నారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, వారం రోజుల్లో దరఖాస్తులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. మండలంలో వంద ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానకు వెళ్లిన రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరాతీశారు. డాక్టర్ సౌజన్య, సిబ్బందితో మాట్లాడారు. గదులను పరిశీలించి, మందులను, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వెటర్నరీ దవాఖానకు వెళ్లిన కలెక్టర్ డాక్టర్ రేఖను అందిస్తున్న వైద్యసేవలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో మందులను తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఆర్ఐ జయభరత్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో విఘ్నేశ్వర్, ఈవో బలరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

# యువకుడి ప్రాణాలు తీసిన ఆన్‌లైన్ గేమ్స్



మృతుడు దాసరి మధు

అందోల్, జూన్ 28 : ఆన్‌లైన్ ఆటలు యువత జీవితాలు నాశనం చేస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా అందోల్‌లో తండ్రికి తెలియకుండా ఆన్‌లైన్ లో గేమ్స్ ఆడిన యువకుడు రూ. 25 వేల వరకు పోగొట్టుకున్నాడు. తండ్రికి సమాధానం చెప్పలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అందోల్‌కు చెందిన దాసరి మధు(19) ఇంటర్ వరకు చదువుకుని ఇంటివద్దే ఉంటున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడిన మధు రూ. 25 వేల వరకు పోగొట్టుకున్నాడు. దీం తో తండ్రికి ఈ విషయం ఎలా చెప్పాలో తెలియక సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని సంగారెడ్డికి తరలించి చికిత్స అం దించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సత్య య్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

# ఆర్టీసీ ఆదాయానికి కొత్త మార్గాలు

- వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు అద్దెకు ఆర్టీసీ స్థలాలు
- సంగారెడ్డి డిపో పరిధిలో 30 దుకాణాల సముదాయానికి స్థల సేకరణ
- కొనసాగుతున్న టెండర్ల ప్రక్రియ

సంగారెడ్డి, జూన్ 23 : ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయడం, కార్గో సేవలతో ఆదాయం పొందుతున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరింత ఆదాయంపై దృష్టిసారించింది. ఆర్టీసీ డిపోలు ఏర్పాటు చేసిన పట్టణాల్లో వృథాగా ఉన్న ఆర్టీసీ స్థలాలపై ఆదాయం వచ్చేలా ఆలోచన చేసింది. సంగారెడ్డి ఆర్టీసి డిపో పరిధిలోని సదాశివపేట, జోగిపేట, దౌల్తాపూర్ బస్టాండ్లలో దుకాణాల ఏర్పాటుకు నిర్ణయించింది. ఇప్పటికే కొనసాగుతున్న దుకాణాలతో పాటు ఖాళీ స్థలాల్లో కొత్త దుకాణాల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానిస్తున్నది. సంగారెడ్డి డిపో పరిధిలో 30 దుకాణాల ఏర్పాటుకు ప్రస్తుతం టెండర్లు స్వీకరిస్తున్నట్లు సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. దుకాణాల ఏర్పాటుకు ఒక దరఖాస్తుకు రూ.1180 చెల్లించి టెండర్ ఫారం కొనుగోలు చేయాలని, అవి డిపో కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. జూలై 1 వరకు టెండర్ దాఖలు చేయవచ్చని డిపో మేనేజర్ తెలిపారు. జూలై 2న సీక్రెట్ టెండర్ల విధానంలో దుకాణాల కేటాయింపులు జరుగుతాయని, దరఖాస్తు ఫారంపై దుకాణం నంబరు ఉంటుందని, ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గమనించాలని కోరారు. టెండర్లు వేసేందుకు రూ.25వేల డీడీ కార్యాలయంలో సమర్పించాలని, టెండర్‌లో దరఖాస్తుదారు పేరు రాకుంటే తిరిగి డీడీలు వాపస్ చేస్తామని ప్రకటించారు. టెండర్‌లో దుకాణం వస్తే సొంతంగా షెడ్ నిర్మాణం చేసుకుని వ్యాపారం చేస్తూ ప్రతినెలా ఆర్టీసీకి అద్దె కట్టాలి. ఐదేండ్ల కాలపరిమితితో దుకాణాల ఏర్పాటుకు అనుమతించారు. సంగారెడ్డిలోని 12/15 విస్తీర్ణం గల 25 దుకాణాలకు రూ.25వేల డీడీ కట్టి టెండర్ పాల్గొనాల్సి ఉంటుంది. 24/15 విస్తీర్ణం గల 5 దుకాణాలకు రూ.50వేలు డీడీ చెల్లించి టెండర్ వేయాలి. వీటితో పాటు కారు, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన 8 వేల చదరపు అడుగుల స్థలం టెండర్‌కు రూ.1.50 లక్షల డీడీ చెల్లించి పాల్గొనాలని డిపో మేనేజర్ సూచించారు. ఇప్పటికే సదాశివపేట, జోగిపేట, దౌల్తాబాద్ బస్టాండ్లలో దుకాణాలకు టెండర్లలో పాల్గొని ఉపాధి పొందుతున్న యజమానులు తిరిగి ఆయా బస్టాండ్లలో దుకాణాలకు టెండర్లు వేయాలని అధికారుల సూ చించారు.



**ఆర్టీసీ మనుగడకే దుకాణాల ఏర్పాటు..**



ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు డిపో పరిధిలోని ఖాళీ స్థలంలో దుకాణాల ఏర్పాటుకు ప్రణాళికలు తయారుచేశాం. డిపో పక్కన కల్వకుంట రోడ్డులో కొత్త దుకాణ సముదాయాన్ని ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారుల ఆమోదం తీసుకున్నాం. ఒకేసారి 30దుకాణాల ఏర్పాటుతో కొందరికి ఉపాధి దొరకడంతో పాటు ఆర్టీసీకి ఆదాయం సమకూరనున్నది. టెండర్లు వేసిన దుకాణాలను యజమానులే షెడ్‌తో నిర్మాణం చేసుకుని టెండర్‌లో వేసిన కోడ్ ప్రకారం ప్రతినెలా అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఐదేండ్ల కాల పరిమితితో దుకాణాలు కేటాయిస్తున్నాం. డిపో ఆవరణలోని మిగతా ఖాళీ స్థలంలో డీమార్ట్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న ట్లు గుర్తించారు. డీమార్ట్ ప్రతినిధులు సర్వే చేసి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అందుకే ఆ స్థలా న్ని టెండర్ కోసం ప్రతిపాదనలో పొందుపరుచలేదు.

**– ఉపేందర్, డిపో మేనేజర్ సంగారెడ్డి**